సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 21-3-2025
సంపుటి: 20 సంచిక: 304
పేజీలు: 8 వెల: రూ.1

## మిస్టర్ ఆంధ్ర పోటీల్లో మెరవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పార్వతీపురంలో ఈ నెల 23న జరగనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు బాడీ బిల్డర్స్ ఎంపికయ్యారు. వీరిని స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఎంపిక చేసినట్లు జిల్లా సెక్రెటరీ వి.విజయ్‌కుమార్, అధ్యక్షుడు బి.ప్రసాద్ తెలిపారు. శ్రీకూర్మంకు చెందిన ఎస్.వైకుంఠరావు 55 కేజీల విభాగంలోను, సింగుపురానికి చెందిన బి.అభి 60 కేజీల విభాగంలోను, డి.జగదీష్ 65 కేజీల విభాగం, డి.జయరాం 65 కేజీల విభాగం, బి.శివమణి 70 కేజీల విభాగం, కె.సుమంత్ 60 కేజీల విభాగం, శ్రీకాకుళం బన్నీ 55 కేజీల విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులంతా ఈ పోటీలలో మెరవాలన్నారు. శ్రీకాకుళం క్రీడాకారులకు స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ కె.శ్రీధర్‌రావు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు, ఎస్.సందీప్‌కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట ఎస్‌బీఐలో
## రూ.3కోట్ల కుంభకోణం



- నకిలీ పేర్లు, అకౌంట్లతో లోన్ల మంజూరు
- బీఎంను బలి చేయడానికి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ పరిధిలో ఉన్న బ్రాంచిల్లో ఎక్కువ టర్నోవర్ చేసే శాఖలు కుంభకోణాలకు నిలయాలుగా మారుతున్నాయి. గార ఎస్‌బీఐలో తాకట్టు పెట్టిన బంగారం కేసును కష్టమర్లు పూర్తిగా మర్చిపోకముందే నరసన్నపేట బజారు బ్రాంచ్‌లో రూ.3కోట్ల కుంభకోణం వెలుగుచూసింది. గత కొద్ది రోజులుగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ... అంతర్గత విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం

**స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నరసన్నపేట బజారు బ్రాంచిలో 'సత్యం' వెలుగులోకి తెచ్చిన నకిలీ రుణాల కుంభకోణం ఇప్పుడు మరో రికార్డును సృష్టించింది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 21 మంది బ్యాంకు ఉద్యోగులకు సీఐడీ విచారణ నిమిత్తం నోటీసులు పంపించింది. 'సత్యం' ఈ వ్యవహారం వెలుగులోకి తెచ్చిన తర్వాత అటువంటిదేమీ లేదని దబాయించిన బ్యాంకు అధికారులు ఆ తర్వాత ఈ కేసు చిక్కుముడి వీడటంలేదంటూ స్వయంగా సీబీఐకి దరఖాస్తు చేసుకున్న విషయం పాఠకులకు విదితమే. కోటి రూపాయలకు పైబడి ఇక్కడ ప్రజల సొమ్ము కనిపించకపోవడంతో ఈ కేసును సీఐడీ దర్యాప్తు చేయాలంటూ కోరిన వెంటనే సమ్మతించడంతో వీరికి నోటీసులు అందాయి. బజారుబ్రాంచి మేనేజర్‌గా శ్రీకర్, రీజనల్ మేనేజర్‌గా టీఆర్ఎం రాజు పనిచేసిన కాలంలో బజారుబ్రాంచిలో విధులు నిర్వహించిన 21 మందికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. అయితే ఇది బ్యాంకు వ్యవహారం కావడంతో వారెవరూ దీన్ని బయటపెట్టడంలేదు. సీఐడీకి శ్రీకాకుళంలో కార్యాలయం లేకపోవడం వల్ల ధ్రువీకరించే అధికారి కరువయ్యారు. కానీ 21 మందికి నోటీసులు వచ్చిన విషయం అత్యంత విశ్వసనీయవర్గాల భోగట్టా మేరకు బయటపడింది.**

# ఘనతకెక్కిన బ్యాంక్
# 21 మందికి షాక్

- పేట బజారు బ్రాంచి ఉద్యోగులకు సీఐడీ నోటీసులు
- రాజు, శ్రీకర్, శ్రీను పాత్రపై విచారణ
- రూ.3.75 కోట్లు నకిలీ రుణాలు



- బినామీ కంపెనీలకు రుణాలు, గృహరుణాలకు కమీషన్
- గార బ్రాంచ్‌లో తాకట్టు నగల మళ్లింపులోనూ ఆయనదే పాత్ర
- కిందిస్థాయి అధికారులను బలి చేసి తప్పించుకునే ఎత్తుగడలు
- 'సత్యం' కథనంతో టీఆర్ఎం రాజుపై వేటు.. రాత్రికి రాత్రి బదిలీ

'రాజు'గారు బ్యాంకును 'బజారు'కీడ్చారు!

దేశంలోనే ప్రధాన బ్యాంకుగా పేరుగాంచిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజియన్ పరిధిలో జరుగుతున్న కుంభకోణాల ఉచ్చు బ్యాంకు రీజనల్ మేనేజర్(ఆర్ఎం) టీఆర్ఎం రాజు చుట్టూ బిగుసుకుంటోంది. ఈ బ్యాంకుకు చెందిన పలు శాఖల్లో బయటపడిన అక్రమ రుణాల మంజూరు, తాకట్టు నగల మళ్లింపు వ్యవహారాల్లో ఆయనే సూత్రధారి అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కిందిస్థాయి సిబ్బందిపైకి నెట్టేసి అతను మాత్రం తప్పించుకుంటున్నారని తెలిసింది. తాజాగా నరసన్నపేట బజారు బ్రాంచి పరిధిలో జరిగిన రూ. మూడు కోట్ల కుంభకోణాన్ని 'సత్యం' పత్రిక వెలుగులోకి తేవడంతో ఉన్న ఫళంగా ఆర్ఎం రాజుపై బదిలీ వేటు వేశారు. పరపతి పోతుందన్న భయంతో వివరాలు బయటకు వెల్లడించకుండా అంతర్గత విచారణ జరుపుతున్నారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ టీఆర్ఎం రాజుపై బదిలీ వేటు పడింది. ఆయనకు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినదీ ప్రస్తుతానికి తెలియడంలేదు. ఆయన స్థానంలో కొత్త రీజనల్ మేనేజర్‌గా బొబ్బిలి నుంచి అబ్దుల్ హాసీబ్ వచ్చి బుధవారం ఉన్న ఫళంగా బాధ్యతలు స్వీకరించారు. రీజనల్ మేనేజర్‌గా టీఆర్ఎం రాజు పని చేసిన కాలంలో ఎస్‌బీఐ బ్రాంచిల్లో అనేక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. ఇంకా రానివి చాలా ఉన్నాయి. వీటి గురించి ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి తెలిసినా బ్యాంకు రెప్యుటేషన్ (పరపతి) దెబ్బతింటుందన్న భయంతో వీటిని బయటపెట్టకుండా అంతర్గత విచారణ అని - మిగతా 4లో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుతం బ్యాంకు రికార్డుల్లో వివిధ రకాల రుణాలు తీసుకున్నారని చూపిస్తున్న వారిలో చాలామందికి అసలు ఆ కేటగిరీలో రుణాలు ఇవ్వలేదని ప్రాథమికంగా తేల్చారు. మొత్తం రూ.11 కోట్లు బినామీల పేరుతో బ్యాంకు ఉద్యోగులే కాజేశారని, అందులో మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లిస్తూ ఈ వ్యవహారం బయటపడే సమయానికి అప్పటి మేనేజర్ శ్రీకర్‌తో కొంత మొత్తం కట్టించడం వల్ల ప్రస్తుతం రూ.3.75 కోట్ల ప్రజాధనానికి లెక్కలు తేలడంలేదని విచారణలో బయటపడింది. బజారుబ్రాంచి కుంభకోణం 'సత్యం' వెలుగులోకి తెచ్చిన తర్వాత ఆమదాలవలస చీఫ్ మేనేజర్ బీఏఎన్ మూర్తిని విచారణకు బ్యాంకు ఉన్నతాధికారులు పంపించారు. అయితే ఈయన మొత్తం తీగ లాగుతున్నారని, పూర్తిస్థాయి నివేదిక అందజేస్తే అందరి బండారం బయటపడుతుందనే ఉద్దేశంతో మూర్తిని రాత్రికి రాత్రే బదిలీ చేశారు. దీంతో ఈ వ్యవహారం అక్కడితో ఆగిపోయిందని, నెమ్మదిగా ఎవరైనా అడిగినప్పుడు ఆ మొత్తాన్ని చెల్లించవచ్చని, ఈలోపు ఆ సొమ్ముతో వ్యాపారాలు నడుపుకొందామని భావించారు. ఎప్పుడైతే 'సత్యం' వరుస కథనాలు ప్రచురించిందో, దీని మీద బ్యాంకు మేనేజర్ శ్రీకర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఆ డివిజన్‌కు డీఎస్పీగా మూర్తి ఉండటం, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఎస్‌బీఐ వ్యవహారాలపై సీరియస్‌గా ఉన్నందున ఫిర్యాదు ఇచ్చిన వెంటనే అరెస్టు చేస్తారన్న భయంతో కోటి రూపాయలు దాటిందన్న నెపంతో సీఐడీకి అప్పజెప్పారు. నిబంధనల మేరకు సీఐడీ విచారణకు నోటీసులు ఇవ్వడం, ఒక్కొక్కర్ని విజయవాడ పిలిచి విచారించడం, ఆ తర్వాత రికార్డులు తెప్పించుకోవడం, వాటిని ఆడిట్ చేయడం వంటి ప్రాసెస్‌లో కొందరు తప్పించుకోవచ్చన్న భావనతో సీఐడీని ఆశ్రయించారు. సీఐడీకి లేఖ రాయడానికి ముందురోజే బ్యాంకు అధికారులు కూడా ఆ కాలపరిమితిలో పని చేసినవారికి నోటీసులు ఇచ్చారు. దీంతో 21 మంది ఒకే బ్రాంచిలో నోటీసులందుకోవడం రికార్డుగా మారింది.

### శ్రీకాకుళం పేరెత్తితే హడలిపోతున్న అధికారులు

ఇక్కడ ఎస్బీఐ రీజనల్ మేనేజర్‌గా పని చేసిన టీఆర్ఎం రాజు గార బ్రాంచిలో తాకట్టు నగల మాయం కేసులో పాత్రధారిగా ఉన్నారని ఆరోపణలు రావడంతో ఇక్కడి నుంచి బదిలీ చేసి ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో చెప్పని బ్యాంకు అధికారులు ఇక్కడ మాత్రం మరొకర్ని తెచ్చి ఆర్ఎంగా నియమించారు. టీఆర్ఎం రాజు వెళ్లిపోయిన దగ్గర్నుంచి ఎస్బీఐలో ఆయన చేసిన నిర్వాకాలు బయటపడుతుండటంతో సమాధానాలు చెప్పుకోలేక కొత్త రీజనల్ మేనేజర్‌కు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. గత కొద్ది నెలలుగా ఆయన సెలవులో ఉన్నారు. ఇప్పుడు కొత్త ఆర్ఎంగా ఎవరికి శ్రీకాకుళం పోస్టింగ్ ఇచ్చినా తాము వెళ్లమంటూ చేతులెత్తేస్తున్నట్టు భోగట్టా. ఇప్పటికి నలుగుర్ని ఇక్కడ ఆర్ఎంగా నియమించినా ఎవరూ రావడంలేదని తెలుస్తుంది. కారణం.. శ్రీకాకుళంలోని అనేక బ్రాంచిల్లో అనేక అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి. ఇవన్నీ టీఆర్ఎం రాజు హయాంలోవి కావడం కొసమెరుపు. గార బ్రాంచి విషయంలో కేవలం స్వప్నప్రియ కుటుంబం మీదే ఫిర్యాదు ఇచ్చి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసు రోజురోజుకు బిగుసుకుంటోంది. దీనికి బ్యాంకు అధికారులు అటు కోర్టులకు, ఇటు పోలీసులకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ పూర్తిగా అప్పటి ఆర్ఎం ఏకపక్షంగా వ్యవహరించారన్న అభిప్రాయం బ్యాంకు అధికారులకు ఉంది. ఇది కొనసాగుతుండగానే శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో కూడా నకిలీ డాక్యుమెంట్లతో రుణాల మంజూరు, బ్యాంకు వద్ద రుణం తీరిపోయిన తర్వాత కూడా ఉండిపోయిన

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ఇతర భాషలపై దురభిప్రాయం కూడదు!

'ఏంత మదమెంత కావరమెంత పొగరు'.. అని ఏదో సినిమాకు పింగళి నాగేంద్ర రాసిన మాటలు ఈ సందర్భానికి సరిగ్గా సరిపోయేట్టున్నాయి. నోటి బలుపని కూడా వర్ణించుకోవచ్చు. వీళ్లు ఈ దేశాన్ని ఏలుతున్న మంత్రులా లేక ప్రాంతాలకు, వారి వారి సంస్థలకు నియమితులైనవాళ్లా? దేశం మొత్తానికి, ప్రజలకు బాధ్యత వహించాల్సిన మంత్రుల భాషణం(మాటతీరు) ఇంత దారుణంగా ఉండటం అత్యంత గర్హనీయం. పార్లమెంటులోనే కాదు.. ప్రజలందరూ ప్రతిస్పందించాల్సిన విషయమిది. అది తమిళ ప్రజలకు సంబంధించిందే కావచ్చు. కానీ ఎవరినైనా అనటానికి వెనుకాడనితనమే కనపడుతున్నది. పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి, అందులోనూ విద్యాశాఖ మంత్రి తమిళ ప్రజలను అనాగరికులంటూ వ్యాఖ్యానించడం తీవ్రమైన విషయం. గతంలోనూ ఈ 'ఉత్తర' కుమారులు ద్రవిడులు నల్లవాళ్లని హీనంగా మాట్లాడటం విన్నాం. దేశంలోని ఒక ప్రాంత ప్రజలను అనాగరికులని అవమానించే దుస్సాహసానికి ఒక మంత్రి పూనుకోవడాన్ని ముక్తకంఠంతో ఖండించాల్సిన విషయం. అందుకే లోక్‌సభలో డీఎంకే సభ్యులు ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఈ సంభాషణ చోటుచేసుకోవడానికి త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలు చేయడం లేదన్న అక్కసే కారణం. తమిళులు ఎప్పటినుంచో హిందీ భాషను తమపై రుద్దడాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపి 2020) ప్రకారం మూడు భాషలు నేర్చుకోవాలని నిర్దేశిస్తోంది. పరోక్షంగా హిందీని దేశమంతా రుద్దేందుకు కేంద్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ విధానం ప్రకారం ద్విభాషా విధానాన్ని కొనసాగిస్తామని తమిళనాడు వాదిస్తోంది. ఉత్తర భారతదేశంలో కూడా ద్రావిడ భాషలు అమలు కావడం లేదు. అసలు ఒక లిపిలేని భాషను ఎక్కువ మంది మాట్లాడుతున్నారని సాకుతో అధికార భాషగా చేసి, అందరూ నేర్చుకోవాలని ఆంక్షలు పెట్టడమేమిటన్నది విమర్శకుల వాదన. ఇది ఉత్తర భారత ఆధిపత్యాన్ని, కేంద్రీకృతతత్వాన్ని అమలు చేయడంలో భాగమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాషలపై ద్వేషాలు ఏమీలేవు. ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు, అభిమానించవచ్చు. కానీ ఆధిపత్య ధోరణితో ఒక భాషను తమపై రుద్దడాన్ని ఎవరూ అంగీకరించరు. ద్రావిడ ప్రాంతంపై హిందీని రుద్దడమే కాదు, ఉత్తర భారతంలోని అనేక ప్రాంతీయ భాషలు హిందీ ఆధిపత్యం వల్ల కనుమరుగైపోయాయనీ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. త్రిభాషా విధానాన్ని అమలుచేయని రాష్ట్రాల విద్యారంగానికి నిధులు నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వం బెదిరించడం, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరి కాదు. తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడుతున్న తమిళనాడు ప్రభుత్వం, తాను ప్రవేశపెట్టే బడ్జెట్ లోగోనూ మార్చేసింది. దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్ కుమ్ ఎల్లామ్' (అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను విడుదల చేసింది. 'మా భాషను, నాగరికతను పార్లమెంటులో అపహాస్యం చేస్తుంటే, మేము దానిని రక్షించుకోవాలి కదా'.. అని స్పష్టం చేసింది. అదే ఇప్పుడు భాషాభిమానం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవంగా చర్చ జరుగుతోంది. ఇదిలా కొనసాగుతుండగా కేంద్రం మరో అంశాన్ని తెరపైకి తెచ్చింది. అదే దేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగే విధంగా ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఉందని పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన ఉత్తరాదిన పార్లమెంటు సీట్లు పెంచి, దక్షిణాదికి పెరగకపోతే, పార్లమెంటుకు దక్షిణ భారతం ప్రాధాన్యత, ప్రాతినిధ్యం తగ్గిపోతాయి. ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకమని ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభిప్రాయపడుతున్నారు. కాగా రాజకీయంగా పరిశీలిస్తే బీజేపీ విస్తరణకు దక్షిణ భారతదేశం పెద్ద ఆటంకంగా ఉన్న విషయం పదేళ్లుగా కనపడుతోంది. తన కేంద్రీకృత జమిలి ఎన్నికల విధానాన్ని నెగ్గించుకోవటానికి ఆ పార్టీకి పార్లమెంటులో ఉన్న సంఖ్యాబలం సరిపోవడం లేదు. అందువల్ల ఏ విధంగానైనా డీలిమిటేషన్ ప్రక్రియలో తనకు బలమున్న ఉత్తర భారతంలో లోక్‌సభ సీట్ల సంఖ్య పెంచుకోవాలనే ఆలోచనతో ఆ పార్టీ వ్యూహకర్తలు ముందుకు పోతున్నారు. దీన్ని గుర్తించిన తమిళనాడు.. ఈ నెల 22న దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులను సమావేశం ఏర్పాటు చేస్తున్నది. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మాత్రమే స్పందించలేదు. కానీ ఎక్కువ పిల్లల్ని కనండి, జనాభా పెంచండి అని పిలుపునిస్తున్నారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను ఈ రకంగా తగ్గించే చర్యలను తిప్పికొట్టాల్సి ఉంది. అహంకారంతో దక్షిణాది ప్రజలపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించాలి.



# ప్రచారకర్తల ప్రమోషన్‌లతో బ్రాండ్ ఫాలో అయ్యేవారున్నారా?

డాక్టర్ మహ్మద్ రఫీ

బెట్టింగ్ యాప్స్ సెలబ్రిటీలు ప్రచారం చేశారు తప్పే! నేను సమర్ధించడం లేదు! కానీ, ఈ ప్రజాస్వామ్య దేశంలో ఒక్క రాజకీయ నాయకులు మాత్రమే డబ్బులు సంపాదించాలన్న మాట! ఇంకెవరు సంపాదించినా కుదరదన్న మాట! చట్టం అంగీకరించదన్న మాట! ఒకసారి ఎమ్మెల్యే అయి ఒక సంవత్సరం పాటు వున్నా అతనికి పెన్షన్ తో పాటు అన్ని రాయితీలు వస్తాయి! గెలిచిన ప్రతిసారి పెన్షన్లు యాడ్ అవుతూ పెరుగుతూ ఉంటాయి! ఇక ఆ కాంట్రాక్టు పనులు, ఈ అభివృద్ధి పనులు అంటూ దోచుకోవడం షరా మామూలే! కానీ అడగకూడదు! వాటికి లెక్కలు కూడా ఉండవు! కమిషన్ లు, పిఅర్సీ కమిటీలు అంటూ ఏమీ లేకుండానే అప్పుడప్పుడు వాళ్ళకు వాళ్ళు శాసనసభలో జీతాలు పెంచేసుకుంటారు! రాయితీలు చట్ట రూపంలో మార్చేసుకుంటారు! అది రాజకీయ నాయకుల హక్కు!

ఇక ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఏ కొంతమందినో మంచివాళ్ళుగా నిజాయితీపరులుగా భావించాలి! మిగిలిన వాళ్లలో చాలామంది ఎంతో కొంత గిల్లుకుని ఇంట్లో ఏదొక మూల దాచుకునే వాళ్లే ఉంటారు! అప్పుడప్పుడు పట్టుబడటాలు, సస్పెండ్ అవడాలు మనం చూస్తూనే ఉన్నాం! వింటూనే ఉన్నాం! కొంతలో కొంత నయం! రాజకీయ నాయకులతో పోల్చుకుంటే ఉద్యోగులు నయం! కొద్దో గొప్పో భయం భయంగా సంపాదించుకుంటారు! గుడ్డిలో మెల్ల!

ప్రభుత్వ ఉద్యోగాలు లేని వాళ్ళలో చాలామంది ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాలు లాగిస్తూ ఉంటారు అతి కష్టంగా! తాతల నాటి క్షేత్రములతో కొనసాగే వాళ్ళు ఏదొక వ్యాపారం చేసుకుంటూ ముందుకు వెళుతుంటారు! సెలబ్రిటీలు తమ స్థాయిలో కష్టపడుతూనే ఉంటారు! ఏ రంగంతో పోల్చుకున్న ఈ దేశంలో రాజకీయ రంగమే సంపాదనకు భలే సుగమమైన రంగం!

ఇక అసలు విషయానికి వద్దాం! మన దేశంలో పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం! అయినా సరే ప్రభుత్వ అనుమతులతోనే బీడీలు, సిగరెట్లు, చుట్టలు అమ్ముతూనే ఉంటారు! సినిమా హాళ్ళలో యాడ్స్ వేస్తూనే ఉంటారు! కానీ, కొనుగోళ్లు ఏమాత్రం ఆగవు! అసలు నిషేధించి పడేయచ్చు! కానీ చేయరంతే! మద్యం అంతే! వాళ్లే అమ్మడానికి అనుమతి ఇస్తారు! మళ్ళీ వాళ్లే "ఊదు ఊదు" అంటూ చెక్ చేస్తూనే ఉంటారు! అదే కోవలో డ్రగ్స్, ప్లాస్టిక్, బెట్టింగ్స్, కోళ్ల పందేలు, గుట్కాలు ఇంకా ఇలాంటి చెత్త చెదారం అంతా!

ఇవాళ ఒక పాతిక మంది మీద కేసులు పెట్టారు! వాళ్ళు బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేశారు! అంటే వాళ్ళు ప్రచారం చేయగానే జనం ఎగబడ్డారన్న మాట! ఆ పాతిక మందిలో ఐదుగురు మినహా మిగిలిన వాళ్లంతా అంత జనాన్ని ఇన్-ఫ్లుయెన్స్ చేసే వాళ్ళు అయితే కాదు! వాళ్ళ మాటలు నమ్మి జనం డబ్బులు పోగొట్టుకుంటారంటే నేను అయితే నమ్మడం లేదు! బెట్టింగ్స్ ఆడటం అలవాటు పడిన వాళ్ళు వారి జీవితాలను బలి చేసుకున్నారు! వీళ్ళు చెప్పారని మాత్రం దిగరు! జనం బాగా తెలివి మీరారు! బ్రాండ్ ప్రచారకర్తను చూసి ఫాలో అయ్యే రకాలు ఇప్పుడు చాలా తక్కువ ఉండొచ్చు! నిజానికి ప్రభుత్వమే బెట్టింగ్ యాప్స్‌ను మన దేశంలో నిషేధించవచ్చు! కొన్ని బూతు సైట్స్‌పై నిషేధం విధించిన మాదిరిగానే! కానీ చేయదు! ఆదాయం కావాలి! సిగరెట్ల నుంచి చెత్త అంతా కొనసాగించాలి! చట్టరీత్యా ఇలాంటివి నిషేధం అని చెబుతూనే వ్యాపారాలు జరిగిపోతుండాలి! బెట్టింగ్ యాప్స్‌కు చిన్న చితకా సెలబ్రిటీలు ప్రచారకర్తలుగా మారి కాస్త డబ్బులు సంపాదించుకున్నది నిజమే! అది అక్రమ సొమ్మే! అదే తప్పు అన్నమాట! రాజకీయ నాయకులు చేసే అవినీతిపై మాత్రం ఎవ్వరూ ప్రశ్నించలేం! పెద్ద పెద్ద స్కాముల్లో మునిగి తేలి వేలాది కోట్లు ఎగేసిన వాళ్ళను పట్టించుకోరు! బ్యాంకుల్లో వేలాది కోట్ల రూపాయలు రుణాలు తీసుకుని ఎగగొట్టి ఏదో ఒక ఎమ్మెల్యే గానో, ఎంపి గానో ఉంటే ఎవ్వరూ పట్టించుకోరు! ఒక సంస్థ సర్వే చేసి దేశం మొత్తం రాజకీయ నాయకుల్లో 66 శాతం మంది రౌడీలు, గూండాలు, స్కాముల వీరులు, వివిధ కేసుల్లో ఉన్నవారే అని తేల్చినా ఎవ్వరికీ పట్టదు! సెలబ్రిటీకి నోటీసులు ఇచ్చి విచారణ నిమిత్తం రెండు మూడు సార్లు స్టేషన్‌కు పిలిపిస్తే అది ఉదయం నుంచి రాత్రి వరకు న్యూస్ మనకు! కళ్ళ ముందు జరిగే రాజకీయ దోపిడీని మాత్రం ప్రశ్నించలేం! అది ప్రజా సేవ! ఇది మాత్రమే అక్రమ సంపాదన!

నిజానికి ఇవి ఎవరికి వారు ఆలోచించుకుని స్వీయ నియంత్రణ పాటించాల్సిన విషయాలు! స్వచ్ఛందంగా కుటుంబంలో పెద్దలు పిల్లలను గమనిస్తూ మంచి చెడు చెబుతూ సక్రమ దారి చూపించాల్సిన అవసరం వుంది! ఇదంతా పెంపక లోపమే! ఇదంతా సెల్‌ఫోన్ ఆడిస్తున్న గేమ్ మాత్రమే! బంధాలు అనుబంధాలు ఎప్పుడో మాయమైపోయాయి! అందరికి లగ్జరీ కావాలి! ఈజీ మనీ కావాలి! ఒకరిని చూసి ఒకరు వాతలు పెట్టుకోవాలి! విపరీతంగా డబ్బు సంపాదించాలి! ఇదే ఇప్పుడు చాలామంది మైండ్ సెట్! ఈ మైండ్ సెట్ మారాలి! ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత ఉండాలి! అప్పుడే న్యూసెన్స్ కు ఫుల్ స్టాప్!

# నకిలీ సమీక్షలు.. ఫేక్ కలెక్షన్స్!!

## - ప్రజలకు దూరమవుతున్న బాలీవుడ్



పాట్నాలోని నగరంలో ఉన్న మైదానాల్లో అతిపెద్దది గాంధీ మైదానం. ఇది నగరం నడిబొడ్డును ఉంటుంది. సాధారణంగా పెద్ద పెద్ద రాజకీయ సభలు జరిగినప్పుడే ఆ మైదానం జనంతో పూర్తిగా నిండుతుంది. అది కూడా కష్టంగానే.. కానీ అల్లు అర్జున్ 'పుష్ప2' సినిమా ప్రమోషన్ అక్కడ నిర్వహిస్తున్నారని తెలియగానే నాకు సందేహం వచ్చింది. కానీ వాటన్నింటిని పటాపంచలు చేస్తూ మైదానం మొత్తం అభిమానులతో నిండిపోయింది. బాలీవుడ్ స్టార్ కు కనిపించని క్రేజ్ ఇక్కడ పుష్పరాజ్‌కు కనిపించింది. ఈ వ్యాసంలో సౌత్ ఇండియా వర్సెస్ బాలీవుడ్ గురించి చర్చ కాదు. నిశ్శబ్ద విప్లవం.. రెండు దశాబ్దాలకు పైగా దక్షిణ భారత సినిమాలు హిందీలో డబ్ అయి, కేబుల్ టీవీ ద్వారా ఉత్తర భారతంలో ప్రతి ఇంటికి చేరాయి. ఇది చాలాకాలం పాటు నిశ్శబ్ద విప్లవంగా సాగింది. చైనా వస్తువులు ఒక్కసారిగా ప్రపంచాన్ని ముంచెత్తిన విధంగా కాకుండా ఇవి ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాయి. ఈ నెల ప్రారంభంలో దోహా కేంద్రంగా ప్రసారం అయ్యే అంతర్జాతీయ వార్తా ఛానెల్ అల్ జజీరా, దాని వెబ్ సైట్ లో ఒక నివేదికను ప్రచురించింది. ఇది బాలీవుడ్ లో లోతుగా పాతుకుపోయిన వార్తా సమీక్ష కుంభకోణాలను బయటపెట్టింది.

**బాలీవుడ్ ప్రస్తుతం ఒక ఫ్రాంకెన్ స్టైయిన్ రాక్షసుడిని సృష్టించింది. అందులో భాగంగా మొదట నిర్మాణ సంస్థలు తమకు ఇష్టమైన సమీక్షకులకు గుర్తించేవి. వారిని ముంబైకి విమానంలో రప్పించి, ఐఫోన్లు బహుమతులుగా ఇచ్చి, లగ్జరీ హోటల్లో బస కల్పించేవి. కానీ సమస్య ఇక్కడే ప్రారంభం అయింది. ఇక్కడ ప్రతివారం కొత్త సినిమాలు విడుదల కావడంతో అన్ని స్థాయి ల్లోనే అవే తరహా సౌకర్యాలను వారు కోరారు. దాంతో వ్యవస్థ నిలకడలేనిదిగా ప్రారంభం అయి, గతి తప్పింది. ఇప్పుడు సమీక్షలు భరించలేనివిగా మారాయి. బ్లాక్ బుకింగ్ స్కామ్.. బాలీవుడ్ పెంచిపోషించిన ఈ కొత్త రివ్యూయర్లు కొత్త సినిమాలు విడుదల సందర్భంగా డబ్బులు చెల్లించకపోతే వారి సినిమాలకు చెత్త రేటింగ్‌లు ఇచ్చి వాటిని డస్ట్ బిన్‌లోకి విసిరే సంప్రదాయాన్ని తీసుకొచ్చారు. లేదా డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసే సంస్కృతికి తెరతీశారు. నేను కొంతమంది విశ్లేషకులతో మాట్లాడిన మాటల ప్రకారం.. బాలీవుడ్ వ్యవస్థ కుళ్లిపోవడానికి కారణం పెద్ద సినీ నిర్మాతలే అంటున్నారు. ఇంతకుముందు పత్రికల్లో పెద్ద ఎత్తున సినిమాకు ప్రకటనలు ఇచ్చేవారు. దాని ఆధారంగా ఈ వ్యవస్థ సినిమాకు నెగటివ్ ప్రచారం రాకుండా చూసుకునేవి.**

బాలీవుడ్ లక్ష్యం ఒకటే సినిమాలకు తప్పుడు రివ్యూలు రాయించి, కృత్రిమ హైప్‌లు క్రియేట్ చేసి ప్రేక్షకులను తప్పు దారి పట్టించడం, వారిని థియేటర్లకు తరలించడం. ఇందు కోసం చిత్రనిర్మాతలు లేదా నిర్మాణ సంస్థలు భారీ మొత్తంలో విమర్శకులకు చెల్లిస్తాయని 'అల్ జజీరా' వెల్లడించింది. పబ్లిక్ రిలేషన్స్.. అల్ జజీరా ప్రకారం.. న్యూస్ వెబ్ సైట్లు సినిమాపై మంచి రేటింగ్ ఇచ్చి వాటికో రేటింగ్ ఇస్తాయి. జనం దృష్టి మొత్తం అక్కడ ఉండేలా చేస్తాయి. ఇక్కడ సమస్య ఏంటంటే బాలీవుడ్ కేవలం మంచి ప్రచారాన్ని కొనడం కాదు. అది కేవలం మంచి సమీక్షలను కొనడం. సినిమా స్టార్ రేటింగ్‌ను పెంచడానికి సమీక్షకులకు డబ్బు చెల్లించడం పూర్తిగా వేరే విషయం.

ఆ కథనం హిందీ సినిమాలో చాలాకాలంగా ఉన్న లోటుపాట్లను నిజానికి కుంభకోణాలకు బయటపెట్టింది. ఈ ఆచారం కొంతమంది విమర్శకుల మాటకు విలువ ఉండేలా పరిమితం చేసింది. ఫ్రాంకెన్ స్టైయిన్.. బాలీవుడ్ కు సమీక్షలకు సంబంధించిన వ్యాపారం సోషల్ మీడియా యుగం రానంతవరకూ బాగానే సాగింది. కానీ ప్రజల చేతుల్లోకి సమాచార విప్లవం రాగానే దాని కథ మొత్తం తల్లకిందులైంది. యూట్యూబర్‌లు వారి అభిప్రాయాలను చెప్పి సామాజిక మాధ్యమాల్లోకి వదలడంతో సినిమాలకు సంబంధించిన నిజమైన పాయింట్లు ప్రజల్లోకి నేరుగా వెళ్లాయి.

ఒక సందర్భంలో ఒక వార్తా పత్రికకు చెందిన సినిమా సమీక్షకుడు ఒక సినిమా బాగాలేదని చెప్పి, తక్కువ రేటింగ్ ఇచ్చాడు. దాంతో నిర్మాతలు యాడ్ ఏజెన్సీ వాళ్లకు ఫిర్యాదు చేశారంట. "మీకు అంత పెద్ద మొత్తంలో సినిమా యాడ్స్ ఇస్తే, మీరు నెగటివ్ రేటింగ్ ఇచ్చురేంటీ అని". దీనిపై పత్రికా యాజమాన్యం ఈ రివ్యూయర్‌ను తీవ్రంగా మందలించింది. మరోక సమీక్ష రాయమని కోరగా, దానికి అతను నిరాకరించడంతో ఆ జర్నలిస్ట్ ను తొలగించారని ట్రేడ్ విశ్లేషకుడు గిరీష్ వాంఖడే చెప్పిన మాట.

బయటకు వచ్చిన రెండో స్కామ్.. ఒక నెల క్రితం ట్రేడ్ అనలిస్ట్ కోమల్ నహ్తా తన యూట్యూబ్ ఛానెల్ లో 'భండా ఫోడ్'(పేలుడు వివరాలు) పేరుతో కొన్ని అంశాలను విడుదల చేశారు. అందులో బాలీవుడ్ చేస్తున్న కొత్త మోసాలను వెలికి తీశాడు. అదే బ్లాక్ బుకింగ్ స్కామ్. బాలీవుడ్ నిర్మాణ సంస్థలు మొదట సినిమాను నిర్మిస్తాయి. ఆ తరువాత ఆ సినిమా ఘన విజయం సాధించిందనే హైప్ ను సృష్టించడానికి సినిమా హాళ్లను సొంతంగా బుక్ చేసుకుంటారు. ఇది రెగ్యూలర్ గా జరుగుతోందని నహ్తా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

ఖాళీ.. ఖాళీ.. చాలా సినిమాలు థియేటర్లలో విడుదల తరువాత ఓటీటీ సంస్థలు కొనుగోలు చేస్తాయి. ఇంతకుముందు ఓటీటీలు ముందస్తుగానే అడ్వాన్స్ లు ఇచ్చి సినిమాలను బుక్ చేసుకునే వారు. ఇప్పుడు వాళ్లు కూడా ముదిరారు. చెత్త సినిమా అని తేలితే వాటిని ఫ్రీగా ఇచ్చిన తీసుకోమని చెబుతున్నారు. ఓటీటీలు సినిమాలు కొనడానికి కొన్ని షరతులు విధించారు. వాటిలో ముఖ్యమైనవి సినిమా హాళ్లలో సినిమా బాగా ఆడిందని చూపించాలి. అందుకే బాలీవుడ్ తన సొంత డబ్బుతో హాళ్లను బుక్ చేస్తున్నాయి. అలాగయితేనే సినిమాకు ఓటీటీలో మంచి ధర వస్తుంది.

కానీ సినిమా దారుణంగా ఉంటే జనాలు ఉచితంగా సినిమా చూపించిన థియేటర్లకు రావడం లేదు. అయినప్పటికీ బాలీవుడ్ మాత్రం తన ప్రయత్నాలకు ఆపడం లేదు. ఐసీయూలో ఉన్న బాలీవుడ్.. బాలీవుడ్ పరిస్థితేంటీ? హిందీలో ఒక మంచి సామెత ఉంది. అందేంటంటే.."మారా హువా హాతీ సేవ్ లఖ్ కా (చనిపోయిన ఏనుగు కూడా లక్షల విలువైనదే)" అలాగే హిందీ చిత్ర పరిశ్రమ ఐసీయూలో ఉంది. దాని బతికించడానికి పునర్ వైభవం తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ అవి సరైన దారిలో కొనసాగడం లేదు. భారీగా పెంచుతున్న లెక్కలు, సమీక్షలు, ప్రజల కళ్లద్దాల వరకే చేరగలవు.

కానీ బాలీవుడ్‌కు భిన్నంగా దక్షిణాది చిత్రపరిశ్రమ నిశ్శబ్దంగా తనను తాను తిరిగి మార్చుకోవడం ప్రారంభించింది. మార్కెటింగ్ గిమ్మిక్కులను నమ్మకుండా మంచి కథలను తెరకెక్కించడం, ప్రేక్షకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కథను చెబుతున్నారు. ఇక్కడ వ్యంగ్యంగా చెప్పదలుచుకున్న విషయం ఒకటి ఉంది. బాలీవుడ్ తన నష్ట నియంత్రణకు వృథా చేసే శక్తిలో సగం అయినా నిజంగా మంచి సినిమాలు తీయడానికి ఖర్చు చేసినా అది మనుగడ సాగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మనమంతా కలిసి చూసే సినిమా త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నారు.

- సంకేత్ ఉపాధ్యాయ



మనది కాని లోకమే అయినా ఓ హృదయ విదారకమైన మరణం.. మానవత్వమున్న ఎవ్వర్నైనా చలింపజేస్తుంది. అలాంటి కొన్ని విషాదాలు కంట తడి పెట్టిస్తాయి. అందుకే అతడి మరణంతో ఫుట్ బాల్ కోర్ట్ కూడా బావురుమంది. ఇది ఓ రోమేనియన్ కథ. 19 ఏళ్ల కుర్రాడు సాకర్ కోసం కలలు కని యుక్తవయస్సు దాటకుండానే ఫుట్‌బాల్ కోర్ట్ నుంచి నేరుగా ఆకాశానికేగిన హృదయవిదారక గాధ.. లూకా మనోలాకే.. సాకర్ కలలుగన్నాడు. రోమేనియన్ జట్టు మెటలోగ్లోబస్ బుకురెస్టీకి ఆశాజనకమైన మిడ్‌ఫీల్డర్‌గా ఎదుగుతున్నాడు. ఇతగాడి ఆట చూసి మరో యువకెరటం ఫుట్‌బాల్‌లో సంచలనం సృష్టించబోతోందని ఫుట్‌బాల్ పండితులు అంచనా వేశారు. ముచ్చటపడ్డారు. బాల్యం నుంచే ఫుట్ బాల్‌పై పెంచుకున్న మక్కువతో మనోలాకే చేసిన నిరంతర ప్రాక్టీస్ యుక్తవయస్సు వచ్చేవరకు తననో ప్రామిసింగ్ ప్లేయర్ గా మార్చింది. తన ఆట చూసి ముచ్చటపడ్డ కోచెస్ రిఫరెన్స్ తో రోమేనియా లిగా-2లో పోటీ పడుతున్న మెటలోగ్లోబస్ బుకురెస్టీలో మనోలాకేకు అవకాశం లభించింది. ఫుట్ బాల్ ప్రపంచంలో మరో రోనాల్డో, మారడోనా, మెస్సీలా మెరిసిపోయే ఆటగాడు తయారవుతున్న తరుణంలో మనోలాకే మరణం రోమేనియా ఫుట్ బాల్ ప్రపంచాన్నే కలిచివేసింది.



# ఫుట్‌బాల్ సైతం బావురుమన్న మరణమతడిది!

**అసలేమైంది మనోలాకేకి..?**

ఏమైందో తెలిస్తే ఏదైనా చేసేందుకు ఆలోచించొచ్చు. అసలు వైద్యంలో పరిష్కారం లభిస్తుందా, లేదా అంచనా వేయొచ్చు. కానీ, లూకాకి కొద్దిరోజులుగా ఉన్నట్టుండి తల తిప్పడం, తీవ్రమైన అలసట, చలిజ్వరం, రక్తంతో కూడిన మలవిసర్జన వంటి సమస్యలన్నీ ముప్పేట దాడి చేశాయి. ఓరోజు ఫుట్‌బాల్ మ్యాచ్ ఆసక్తికరంగా నడుస్తున్న తరుణంలో మనోలాకే ఉన్నట్టుండీ తీవ్ర అలసటకు గురయ్యాడు. సగం మ్యాచ్ అయ్యేసరికే అతను ఆడలేని స్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో అతడి తల్లిదండ్రులు, తోటి జట్టు సభ్యులు ఆ విషయాన్ని గమనించారు. స్టామినాతో కనిపించే మనోలాకే ఒక్కసారి బలహీనంగా, క్షీణించినట్టు కనిపించడంతో అందరిలోనూ ఏదో తెలియని ఆందోళన ఆవరించింది.

**సవాళ్లతో కూడిన వైద్య ప్రయాణం చేశాడు మనోలాకే!**

యువ అథ్లెట్ వైద్య ప్రయాణం ఆయన కుటుంబీకులతో పాటు, తోటి స్నేహితులను, ఫుట్ బాల్ ప్లేయర్స్ నూ అందరినీ ఆందోళనకు గురిచేసింది. ఎక్స్ రేలు, రక్తపరీక్షలు అన్నీ చేశారు. అన్నీ నార్మల్ గానే చూపించాయి. కానీ, మనోలాకే ఇబ్బంది మాత్రం సాటి మనుషులను కూడా కృంగదీస్తోంది.

వైద్యులు లోపల ఏదైనా ఇన్ఫెక్షన్స్ ఉన్నాయేమోననీ అనుమానించారు. డాక్సీసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్, జ్వరానికి పారాసెటిమాల్, నొప్పులకు అల్గోకాల్మిన్ వంటి మందులిచ్చారు. కానీ, ఆ మందులకు మనోలాకే స్పందించలేదు సరికదా.. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తూవచ్చింది. రానురాను ఏ మెడిసిన్ కు కూడా మనోలాకే శరీరం స్పందించకుండా పోయింది.

**ప్రాణాంతకంగా మారిన గుర్తించలేని వ్యాధి!**

గత నెల ఫిబ్రవరి 28వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లినప్పుడు లూకా ఆరోగ్య లక్షణాలు మరింత తీవ్రంగా మారాయి. అత్యవసరంగా ఆంబులెన్స్ కు ఫోన్ చేశారు. అప్పటికి అతడి తల్లి అనా మరియా బుకారెస్ట్ లో పనిచేస్తోంది. తల్లితో ఫోన్ లో మాట్లాడాడు లూకా. అమ్మా నామీంచి కావడం లేదు.. నేను చనిపోతున్నానా అంటూ ఆ తల్లినడిగాడు. ఆ విషయాన్ని ఆమె అక్కడి లోకల్ ప్రెస్ తో కన్నీటిపర్యంతమవుతూ షేర్ చేసింది.

ఆంబులెన్స్ లోకెక్కే సరికే లూకా పరిస్థితి మరింత నాటకీయంగా మారిపోయింది. కళ్లు బైర్లు కమ్మాయి. ఏమీ కనిపించడం లేదు. ఈ లక్షణాలున్నప్పుడు మెదడుకు ఆక్సిజన్ అందకుండా పోయే పరిస్థితి నెలకొంది. బీపీ పూర్తిగా డౌన్ అయిపోయింది. రక్తవాంతులయ్యాయి. జీర్ణాశయంలో నెలకొన్న అసాధారణ పరిస్థితులతో సాధారణ పరీక్షల్లో అసలు మనోలాకే జబ్బునే సరిగ్గా నిర్ధారణే చేయలేకపోయారు వైద్యులు.

తల్లి మరోచోట ఉద్యోగం చేస్తుండటంతో కొడుకుతో ఎక్కువ సమయంలో గడపలేకపోయింది. మరోవైపు, మరణించే చివరి క్షణాల్లో తనతో కొడుకు మనోలాకే మాట్లాడిన మాటలు అనా మరియాను ఇంకా కృంగదీశాయి. అసలు వైద్యులను ఎంచుకునే విషయంలోనే ఏమైనా పొరపాట్లు చేశామా అనే మీమాంస కలిచివేసింది.

**శోకంలో ఫుట్‌బాల్ సంఘం!**

లూకా మరణం రోమేనియన్ ఫుట్‌బాల్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. మెటలోగ్లోబస్ బుకురెస్టికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో లూకా మనోలాకేకు ఘన నివాళినర్పించారు. నివాళి అర్పించడంతో పాటు.. తమ ఫుట్ బాల్ క్రీడాసమాజంపైనే లూకా మరణం తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నారు. ఫుట్ బాల్ పట్ల లూకా ప్రేమ, చిరునవ్వుతో మైదానంలో ఓ లేడిపిల్లలా పరిగెత్తే ఆ యువకుడి తీరు జట్టులో ఆనందాన్ని రేకెత్తించేవంటూ లూకాను గుర్తుచేసుకుంది మెటలోగ్లోబస్ బుకరెస్టి ఫుట్ బాల్ క్లబ్. లూకా చివరిసారిగా ఆగస్టు 2024, ఆగస్ట్ 24వ తేదీన తన చివరి మ్యాచ్ ఆడాడు.

**లూకా మరణం ఇప్పుడు యంగ్ ప్లేయర్లకు ఓ హెచ్చరిక!**

అవునూ, ప్రొఫెషనల్ ప్లేయర్స్ గా ఎదిగే క్రమంలో నిత్యం కచ్చితంగా ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెట్టడం, ఎప్పటికప్పుడూ చెక్ అప్స్ చేయించుకోవడం, ఆరోగ్య పర్యవేక్షణను ఓ క్రమశిక్షణగా మార్చుకోవడం వంటి అప్రమత్తతలను క్రీడాలోకం ముందుంచేది.

**రోమేనియన్ ఫుట్ బాల్ సమాజం మర్చిపోలేని ముద్ర!**

లూకా మనోలాకే ఆడిన కాలం తక్కువే. వాస్తవానికి ఫుట్ బాల్ ప్రపంచంలో సాధించిదీ తక్కువే. పైగా తన సాకర్ లక్ష్యం నెరవేరకుండానే దివికేగాడు. కానీ, తన ప్రొఫెషనల్ ఆటతీరు, తన సానుకూల దృక్పథం, మొహాన చెరగని చిర్నవ్వుతో తనకంటూ ఫుట్ బాల్ ప్రపంచంలో ఓ గుర్తింపును పొంది వెళ్లిపోయాడు. అందుకే, లూకా మరణంతో ఫుట్ బాల్ కోర్ట్ సైతం బావురుమంది.

లూకా మనోలాకే మరణం రోమేనియన్ ఫుట్ బాల్ సమాజంలో ఓ పెను విషాదం. అయితే, ఆ మరణంలోనూ ఓ సందేశాన్ని వదిలి వెళ్లాడు లూకా. ఎంతకాలం బతికామన్నదానికన్నా.. తమదైన సానుకూల ప్రభావాన్ని సమాజంపైన ఎంత బలంగా వేయగల్గామన్నదే లూకా నేటి యువతకు ప్రేరణగా వదిలి వెళ్ళిన ఆ సందేశం.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## పలాస మున్సిపాలిటీలో శాశ్వత త్రాగునీటి సమస్యకు పరిష్కారం

(సత్యంన్యూస్, పలాస)


2002 నుండి మునిసిపాలిటీ ఏర్పాటు తరువాత నేటివరకు త్రాగు నీటికి ఎప్పటికీ సమస్యగానే మిగిలిపోయింది. గత 2014లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనాడే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో శాశ్వత త్రాగు నీటికి పరిష్కారం కొరకు కంకణం కట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంకు వచ్చిన తరువాత స్ధానిక మాజీ మంత్రి మునిసిపాలిటీకి శాశ్వత త్రాగునీటికి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చి, ప్రజలకు మోసం చేశారన్నారు. 2024 తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్‌తో స్వయంగా మాట్లాడి ఉద్దానం ప్రాజెక్టు ద్వారా 5 యం.ఎల్.డి. నీటిని మునిసిపాలిటీకి త్రాగు నీరు సరఫరా చేయాలని కోరారు. ఈ విషయంలో స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఈ ప్రాంతవాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. దీంతో దశాబ్దాలా నాటి నీటి కష్టాలు తీర్చడానికి ఎమ్మెల్యే విశేష కృషి చేయడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది మే నాటికి పూర్తిస్థాయి నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి తగిన ప్రతిపాదనలతో ముందుకు వచ్చే విధంగా చూస్తున్నారని పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సీపాలిటి పరిధిలోని నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221


## సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవృక్షం, అత్యంత శక్తివంతమైన బంగారు తల్లి పాత శ్రీకాకుళంలో కొలువై ఉన్న సంతోషిమాత అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, అలంకరణ సేవ, శ్రీ సూక్తం విధానముగా షోడశోపచార సహిత సహస్రనామార్చన, కుంకుమ పూజ, శ్రీదేవీ ఖడ్గమాలతో కుంకుమ పూజ, లలిత సహస్రనామం పారాయణ, మహా నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, మంగళ హారతి, చతుర్వేద పారాయణం, వేద ఆశీర్వచనంలను అమ్మవారి ఉపాసకులు, ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కె.సర్వేశ్వరరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థిని అభినందించిన ఎస్‌బీఐ సిరిపురం క్యాషియర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిరిపురంలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి వంజరాపు లక్ష్మీనారాయణకి బెల్లుపటియా గెడ్డ వద్ద ఎస్‌బీఐ సిరిపురం క్యాషియర్ వారిది ఐఫోన్ దొరికినది. పాఠశాల ప్రార్థన సమయంలో క్యాషియర్ వారికి పాఠశాల సిబ్బంది సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ క్యాషియర్ మాట్లాడుతూ సిరిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలను బోధిస్తున్నందుకు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కొనియాడారు. సదరు విద్యార్థికి మరింత స్ఫూర్తి నింపేలా చేతి గడియారాన్ని, చిరుకానుకను ఈ సందర్భంగా ఎస్‌బీఐ మహాదేవపురం శాఖలో పనిచేస్తున్న క్యాషియర్ శ్రీహరి అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు స్ఫూర్తిని నింపేలా భవిష్యత్తులో కూడా ఇటువంటి నైతిక విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తద్వారా జీవితంలో ఉన్నత స్థానం పొందడంతో పాటు మంచి విలువలు కలిగిన వ్యక్తిగా పరిణితి చెందుతారని తెలిపారు. సందర్భంగా సదరు విద్యార్థికి పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో జగన్నాథం, సిమంచలోపతి, వైకుంఠరావు, నారాయణరావు, ఢిల్లీరావు, శశి బాబురావు, తనుజ, మోహన్‌రావు, మురళీమోహన్, కామేశ్వరరావు, రమణారావు, ఈశ్వరరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశలకు కనీస వేతనాలివ్వాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.నాగమణి, సిటు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఆశాల జాతీయ కోర్కెలు దినం సందర్భంగా ఆశా వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సిటు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆశాల జిల్లా నోడల్ అధికారి రవి ప్రసాద్‌కు సామూహిక వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశాల సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, నాయకులు పి.జయలక్ష్మి, మన్నె మణి కుమారి, రాకోటి సుజాత, కె.లీలావతి, చంద్రకళ, జి.కళ్యాణి, పి.సుహాసిని, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## ఒడిశా సరిహద్దులో రెచ్చిపోతున్న ఇసుకాసురులు



(సత్యంన్యూస్, కొత్తూరు)

కొత్తూరు మండలం రాయల గ్రామ సమీపంలో వంశధార నదిలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పక్కనే ఉన్న ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి వేళల్లో టిప్పర్లకు లోడింగ్ చేస్తూ ఒడిశాలోని పర్లాకిమిడి, గుణుపూర్ పట్టణాలకు తరలిస్తున్నారు. అక్కడ టిప్పర్ లోడ్ ఇసుకను ఎనిమిది వేల రూపాయలకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆంక్షలకు తూట్లు పొడుస్తూ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అక్రమార్కులు అక్రమ ఇసుక రవాణా, అమ్మకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమాలను అరికట్టాలని చర్యలు ప్రజలు కోరుతున్నారు.








## బీల ప్రాంతాన్ని ఎకో టూరిజం చేయాలి

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

బీలప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సోంపేట మండలం కూటమి ప్రతినిధి, గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు గండుపల్లి చిన్న రాజారావు కోరారు. ఈమేరకు ఆయన పెట్టుకున్న అర్జీ మేరకు జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు క్షేత్ర పరిశీలన చేశారు. జనసేన ఇచ్ఛాపురం సమన్వయకర్త సమక్షంలో బారువ కంబ నుంచి పల్లిగొల్లగండి, ఇసకల పాలెం, ఒంటూరు, కళింగపట్నం, ఇద్దివానిపాలెం బీచ్‌లు పరిశీలించారు. దీనిపై పూర్తి వివరాలతో కూడిన రిపోర్ట్ తయారుచేసి కలెక్టర్‌కు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం జనసేన సమన్వయకర్త దాసరి రాజు, జనసేన స్టేట్ జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, ఇద్దివానిపాలెం పంచాయతీ జనసేన ప్రతినిధి బైపల్లి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



## పీ4పై అవగాహన సభ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 ద్వారా పేదరికం లేని సమాజాన్ని నిర్మించే అంశంపై 14, 15 డివిజన్ల ప్రజలకు శుక్రవారం అవగాహన సభ నిర్వహించారు. వార్డ్ ఇన్‌ఛార్జీలు ఇప్పిలి తిరుమలరావు, తాళ్లూరి నవీన్‌కుమార్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. వినతి పత్రాలు కూడా స్వీకరించారు.

### మీకు తెలుసా!.. పెట్రోల్ బంకుల్లో

# ఈ సేవలు ఉచితం



ఓ వ్యక్తి బంకులో పెట్రోల్ పోయించుకుని కాస్త దూరం వెళ్లగానే బైక్ మొరాయించింది. ఆ పరిస్థితికి పెట్రోల్ నాణ్యత లోపమే కారణమని భావించి బంకు నిర్వాహకులను నిలదీశాడు. వారి నుంచి నిర్లక్ష్య సమాధానం వచ్చినా.. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక మౌనంగా వెళ్లిపోయాడు. ఇదొక్కటే కాదు.. బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మడంతో పాటు కొన్ని రకాల సేవలు ఉచితంగా అందించాల్సి ఉంటుందన్న విషయం చాలామందికి తెలియదు. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించినా, కొట్టించకపోయినా ఈ సౌకర్యాలు పొందవచ్చు. బంకుల్లో ఇవి అందుబాటులో లేకపోతే సంబంధిత పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయొచ్చు. బంకుల్లో ఉండాల్సి ఉచిత సౌకర్యాలేమిటో చూద్దాం.

**ప్రథమ చికిత్స కిట్:** ప్రతి బంకులోనూ విధిగా ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలి. ఇందులో వైద్య పరికరాలను, ఔషధాలను ఎప్పటికప్పుడు మార్చడం తప్పనిసరి.

**తాగునీరు:** సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారుల, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు బంకులన్నింటిలో పరిశుద్ధమైన తాగునీటి సౌకర్యం కల్పించాలి. బంకు యజమాన్యమే బాధ్యత తీసుకుని నాణ్యత కలిగిన ఆర్వో యంత్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**మరుగుదొడ్లు:** స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఆరుబయలు ప్రదేశాలు, పెట్రోల్‌బంకుల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. మహిళా ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నది దీని వెనుక ఉద్దేశం.

**ఫోన్ సౌకర్యం:** అత్యవసర సమయాల్లో ఫోన్ చేసుకునేందుకు బంకుల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

**వాహనాలకు ఉచిత గాలి:** వాహనాల టైర్లలో గాలి నింపడానికి, తనిఖీ చేసుకోవడానికి బంకుల్లో తప్పనిసరిగా సంబంధిత యంత్రం ఏర్పాటు చేయాలి. దానికోసం ఓ వ్యక్తి అందుబాటులో ఉండాలి. ఈ సౌకర్యం పూర్తిగా ఉచితం. అయితే సర్వీస్ నచ్చి ఎవరైనా వాహనదారు 'టిప్' ఇస్తే తీసుకోవచ్చు కానీ నిర్బంధంగా వసూలు చేయరాదు.

**ఫిర్యాదుల పెట్టె:** ఫిర్యాదు పెట్టె అందుబాటులో ఉంచాలి. బంకుల నిర్వహణ, పెట్రోల్, డీజిల్‌కు సంబంధించి వినియోగదారులు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు రాసి అందులో వేయొచ్చు.

**నాణ్యత ప్రమాణాల తనిఖీ:** పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం కలిగే అక్కడే తనిఖీ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు కూడా బంకు వాళ్లే అందుబాటులో ఉంచాలి. దీనితోపాటు పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందనిపించినా.. పరీక్షించుకోవచ్చు.

### ఫిర్యాదు ఎలా?

ఈ సౌకర్యాల్లో ఏ ఒక్కటి లేకపోయినా, బంకు సిబ్బంది దురుసుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించినా ఆయా పెట్రోలియం సంస్థలకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. చిరునామా, ఇతర సమాచారం ఇస్తే.. సంబంధిత చమురు సంస్థ వారిపై చర్యలు తీసుకుంటుంది.

హెల్ప్‌లైన్ నెంబర్లు..

**ఇండియన్ ఆయిల్:** 1800233355
**భారత్ పెట్రోలియం:** 1800224344
**హెచ్‌పీసీఎల్:** 18002333555
**రిలయన్స్:** 18008919023

### ఘనతకెక్కిన బ్యాంక్..

# 21 మందికి షాక్

(మొదటిపేజీ తరువాయి)

డాక్యుమెంట్లతో దొంగరుణాలు పొందిన విషయం వెలుగులోకి వచ్చింది. నరసన్నపేట బజారు బ్రాంచి వ్యవహారం సీఐడీ వరకు వెళ్లింది. ఇలా అనేక బ్రాంచిల్లో అనేక అవకతవకలు ఉండటం వల్ల ఇక్కడ ఆర్‌ఎంగా పని చేయడం కంటే ఉద్యోగం చేయకపోవడం బెటరనే ఆలోచనలో ఇక్కడకు రావడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదని తెలుస్తుంది.

**సీజీఎంకు బ్లాక్‌మెయిల్**

గార ఎస్‌బీఐ బ్రాంచిలో తాకట్టు పెట్టిన నగలు మాయమైనప్పుడు కేవలం అక్కడ ఉన్న చెస్ట్ కస్టోడియన్ల పాత్ర మాత్రమే కాకుండా ఆర్‌ఎం స్థాయి వ్యక్తుల ప్రమేయం కూడా ఉంటుందని, బ్యాంకింగ్ వ్యవస్థలో చీమ చిటుక్కుమన్నా ఆర్‌ఎం స్థాయి వ్యక్తికి మినిమం సమాచారం ఉండాలనే నిబంధన ఉంది. అటువంటప్పుడు ఆయన పాత్ర కూడా ఉంటుందనేది సుస్పష్టం. ఈమేరకు అప్పటి ఆర్‌ఎం రాజు పాత్ర ఉందనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. వీటినే 'సత్యం' దఫదఫాలుగా అనేక కథనాల రూపంలో ప్రచురించింది. దీంతో రాజుపై శాఖాపరమైన విచారణ జరిపించాల్సి ఉండగా, ఆయన మాత్రం ఇవన్నీ తిలాపాపం తలా పిడికెడు మాదిరిగా ఎస్బీఐ సీజీఎంకు తెలిసే చేశామని, పోలీసులు అడిగితే ఇదే మాట చెబుతామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు భోగట్టా. ఈమేరకు సీజీఎం అప్పటి ఆర్‌ఎం టీఆర్‌ఎం రాజుకు వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్‌లను ఆధారంగా చూపిస్తారని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఫీల్డ్ ఆఫీసర్‌గా చింతాడ శ్రీనివాసరావు గార బ్రాంచిలో పని చేసినప్పుడు తాకట్టు నగలు మాయమైన కేసు నమోదైంది. ఆ తర్వాత నరసన్నపేట బ్రాంచికి బదిలీ అయినప్పుడు నకిలీ రుణాల కుంభకోణం వెలుగుచూసింది. దీంతో చింతాడ శ్రీనివాసరావు సంపాదనపై సీఐడీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తుంది. బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల అకౌంట్ల వివరాలు, స్థిర చరాస్తులు, బ్యాంకు అకౌంట్ల నుంచి జరిగిన లావాదేవీలు ఇంతకు క్రితమే స్వప్నప్రియ కేసు పునర్విచారణ జరిపినప్పుడు మన పోలీసులు సేకరించారు. అయితే ఈ కేసు ఏమైందో తెలీదు గానీ, ఇప్పుడు నరసన్నపేట బజారు బ్రాంచి అంశంలో మాత్రం చింతాడ శ్రీనువైపు సీఐడీ దృష్టి సారించింది. టీఆర్‌ఎం రాజుతో ఆయనకున్న సాన్నిహిత్యం, గార కుంభకోణం వెలుగుచూసిన వెంటనే నరసన్నపేట బజారు బ్రాంచికి బదిలీ కావడం వంటివాటిపై దృష్టి సారించారు.

## పిల్లల పోషణ, చదువుపై శ్రద్ధ చూపాలి



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

అంగన్వాడీ పిల్లల విషయంలో పోషణ, చదువు రెండూ ముఖ్యమేనని, వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రొట్టవలస జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంవీ రమణమూర్తి అంగన్వాడీ టీచర్లకు సూచించారు. పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ బూర్జ సెక్టార్ పరిధిలో శుక్రవారం అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశాలు పెద్దగా ఉన్నాయని, వాటిని అందుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.రత్నం, పురుషోత్తపురం పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతిర్మయి, ఎం.జానకీలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 23న అక్షరాస్యతా అర్హత పరీక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వయోజన విద్యా శాఖ ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో నమోదు కాబడిన వయోజనులకు అక్షరాస్యతా పరిక్ష జాతీయ సార్వత్రిక విద్యా పీఠం, నోయిడా వారి సహకారంతో నెల 23న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వయోజన విద్య ఉప సందాలకులు ముద్దాడ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నీ గ్రామాల్లోని 2840 అంగన్వాడీ కేంద్రాలలో ఈ పరీక్షా కేంద్రాలు నిర్వహించబడతాయని, శ్రీకాకుళం జిల్లాలో 39,940 మంది ఉల్లాస్ కార్యక్రమంలో నమోదయ్యారని, గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లో గల సీసీలు, వీవోఏలు, అంగన్వాడీ టీచర్లు, ఇన్విజిలేటర్స్‌గా వ్యవహరిస్తారని ఆయన వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏదైనా 3 గంటల్లో ఈ పరీక్ష రాయవలసి ఉంటుందని వెంకటరమణ తెలిపారు. గ్రామాల్లోని వాలంటరీ టీచర్లు శతశాతం హాజరయ్యేలా కృషి చేయాలని, ఇందుకు గాను మండల స్థాయిలోని మండల మహిళా సమాఖ్య, సహాయ ప్రాజెక్టు మేనేజర్, సెర్ప్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు.

# దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికితీసి వారిని ప్రోత్సహించాలని, వారు ఎందులోనూ తీసిపోరని జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలసి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా నిలిచి, ప్రభుత్వపరంగా చేయూతనిస్తామన్నారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. స్వాభిమాన్ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారిణి సుధా, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కుమార్, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు, బధిరులు తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబ సత్రంలో వడ్డించిన తాతామనుమడు

**తిరుమల:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు నారా దేవాంశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు సీఎం చంద్రబాబుకు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అర్చకులు లాంఛనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలిచ్చారు. తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం తరిగొండ వెంగమాంబ సత్రంలో దేవాంశ్‌పేరుతో అన్నదానం నిర్వహించారు. చంద్రబాబు, కుటుంబ సభ్యులు ప్రసాదాలు వడ్డించారు. మధ్యాహ్నం తిరుమల నుంచి బయలుదేరి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.



## శివానీలో శక్తి యాప్ డౌన్‌లోడ్



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

చిలకపాలెం వద్ద ఉన్న శివానీ ఫార్మసీ కళాశాలలో శక్తి యాప్‌ను పెద్ద ఎత్తున శుక్రవారం విద్యార్థినులతో మొబైళ్లలో ఇన్‌స్టాల్ చేయించారు. ఈ యాప్ కోసం ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసిన ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ టీమ్‌లతో రికార్డు స్థాయిలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్ఐ రవికుమార్ నేతృత్వంలో శక్తి టీమ్ పోలీసులు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కూడా హైస్కూల్ విద్యార్థులతో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.